క్లుప్తంగా

భగవద్గీత పారాయణం



సామూహిక భగవద్గీత పారాయణం చేస్తున్న మహిళలు

జహీరాబాద్: పట్టణంలోని రాచన్నపేట్‌లో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహం వద్ద మహిళలు సామూహికంగా సంపూర్ణ భగవద్గీత పారాయణం చేశారు. శనివారం వినాయక మండపంలో గీత జ్ఞాన వాహిని ఆధ్వర్యంలో లోక కల్యాణార్థం భగవద్గీతతో పాటు విష్ణు సహస్ర నామ పారాయణం చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మహిళలు ఆకు పచ్చ చీరలను ధరించి పాల్గొన్నారు. రాచన్నపేట్ గణేశ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

భక్తిశ్రద్ధలతో భోగ్‌బండార్



భోగ్‌బండార్‌లో పాల్గొన్న భక్తులు

నారాయణఖేడ్: నారాయణఖేడ్ జంట గ్రామమైన మంగల్‌పేట్ జర్నలిస్టు కాలనీలో భవానీమాత ఆలయం ఆవరణలో శనివారం ఖేడ్ నియోజకవర్గ స్థాయి భోగ్‌బండార్, సేవాలాల్ మహారాజ్, భవానీమాతకు ప్రత్యేక పూజలు, యజ్ఞాలు, కీర్తన, జాగరణ, దీపారాధన తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఎస్‌ఆర్‌ఐ గుర్రపు మశ్చందర్, ఖేడ్ తాజా మాజీ జెడ్పీటీసీ లక్ష్మీబాయి, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ జిల్లా మాజీ సభ్యులు రవీందర్‌నాయక్, సత్యపాల్‌రెడ్డి, ప్రభాకర్‌తో పాటు ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు, వివిధ తండాల భక్తులు పాల్గొన్నారు.

ప్రతీఒక్కరిలో భక్తిభావం ఉండాలి

నారాయణఖేడ్: ప్రతీఒక్కరిలో భక్తిభావం ఉండాలని హరిభక్త పారాయణ్ జ్ఞానేశ్వర్‌రెడ్డి మహారాజ్ అన్నారు. మండలంలోని సంజీవన్‌రావుపేటలోని అనంతశయన మందిర ఆవరణలో అనంతశయన గణేష్ మండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అఖండహరినామ సప్తాహంలో భాగంగా శనివారం ఆయన హరిభక్త పారాయణం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తిభావం ఉంటే భగవంతుడి కృపకు పాత్రులవుతారన్నారు. అర్చకుడు ప్రవీణ్, తాజా మాజీసర్పంచ్ విఠల్, తాజామాజీ ఎంపీటీసీ భూపాల్, గ్రామపెద్దలు, ఉత్సవకమిటీ బాధ్యులు, భక్తులు మహారాజ్‌ను సన్మానించారు.

నియామకం



నియామక ఉత్తర్వుకాపీని అందిస్తున్న జీవన్ కుమార్

నారాయణఖేడ్: బహుజన రాజ్యాధికారసమితి మనూరు మండల అధ్యక్షుడిగా రమేశ్‌నాయక్‌ను నియమించారు. సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు అలిగేజీవన్ కుమార్ ఉత్తర్వులు జారీ చేసి, శనివారం ఖేడ్‌లో నియామక ఉత్తర్వు కాపీను అందజేశారు. ఈ సందర్భంగా రమేశ్‌నాయక్ మాట్లాడుతూ.. పూలే, అంబేడ్కర్, కాన్షీరాంల ఆశయసాధన, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, అగ్రవర్ణాల పేదల సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తానని తెలిపారు. సమితి మండల కన్వీనర్ సంజీవ్, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజల పక్షాన పోరాడాలి



హరీశ్‌రావుతో బీఆర్‌ఎస్ నాయకులు

మునిపల్లి(అందోల్): ఆరు గ్యారెంటీల అమలు కోసం ప్రజల పక్షాన పోరాడాలని మాజీ మంత్రి హరీశ్‌రావు సూచించారు. శనివారం క్యాంపు కార్యాలయంలో ఆయనను బీఆర్‌ఎస్ మండల నాయకులు కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రుణమాఫీ రైతులందరికి చేస్తామని చెప్పి, ఇప్పుడు రేషన్ కార్డు ప్రాతిపదికన అంటూ కొర్రీ పెట్టడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సాయికుమార్, నాగేష్, శ్రీనివాస్, నవీన్ పాల్గొన్నారు.

నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

సంగారెడ్డి క్రైమ్ : పట్టణంలోని మహబూబ్ సాగర్ చెరువు వద్ద గణనాథుల నిమజ్జనం కోసం చేసిన ఏర్పాట్లను టౌన్ సీఐ భాస్కర్ పరిశీలించారు. మిగిలిన పనులు త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు.

నారింజ నీరు కర్ణాటక పాలు

- ప్రాజెక్టును అభివృద్ధి చేయకపోవటమే కారణం
- పట్టించుకోని ప్రభుత్వాలు



గేట్లు ఎత్తడం వల్ల కర్ణాటక రాష్ట్రం వైపు తరలివెళ్తున్న నారింజ నీరు

జహీరాబాద్ టౌన్: ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు తగ్గు ముఖం పట్టడంతో నారింజ ప్రాజెక్టు గేట్లను అధికారులు మూసేశారు. భారీ వర్షాల వల్ల నారింజకు వరద నీరు రావడంతో గేట్లు ఎత్తివేశారు. సుమారు మూడు టీఎంసీల నీరు కర్ణాటక రాష్ట్రం వైపు తరలిపోయింది. ప్రతిఏడాది వర్షాకాలంలో భారీ వర్షాలు పడిన సందర్భాల్లో ఇలా నీరు వృథాగా అవుతుంది. జహీరాబాద్ మండలంలోని కొత్తూర్(బి) గ్రామం వద్ద సుమారు ఆరు దశాబ్దాల క్రితం నారింజ ప్రాజెక్టును 600 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించారు. ఒక టీఎంసీ సామర్థ్యం గల ఈ ప్రాజెక్టు పరిధిలో సుమారు వెయ్యి ఎకరాలకు సాగు నీరు అందించాలనే లక్ష్యంతో నిర్మించారు. కుడి, ఎడమ కాలువల నిర్మాణం లోపం వల్ల ఇప్పటి వరకు ఎకరం పొలానికి నీరందలేదు. దీంతో ప్రాజెక్టును ఊట చెరువుగా మార్చేశారు. శాశ్వత నీటి వనరులు లేని ఈ ప్రాంతంలో నారింజ ప్రాజెక్టును అభివృద్ధి చేయాలని రైతులు ఎన్నో మార్లు ఉద్యమాలు, ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రభుత్వాలు మారినా నారింజ ప్రాజెక్టు గురించి పట్టించుకునే నాథుడే కరువయ్యారు.

సాధారణ వర్షానికే జలకళ

ఒకటి రెండు భారీ వానలకే ప్రాజెక్టు నిండిపోయి జలకళ సంతరించుకుంటుంది. వర్షాకాలంలో భారీ వానలు పడితే గేట్లు ఎత్తివేసి ఆ నీరంతా వృథాగా కర్ణాటకకు వదిలేస్తుంటారు. ఇలా ప్రతి సంవత్సరం రెండు, మూడు టీఎంసీల నీరు తరలిపోతుంది. నీరు కర్ణాటక రాష్ట్రం పాలు కాకుండా ఉండేందుకు నారింజను పూర్తిగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని రైతులు అభిప్రాయ పడుతున్నారు.

గేట్ల మరమ్మతులు.. పూడికతీత పనులు

నారింజ ప్రాజెక్టు గేట్లు దెబ్బతిన్న కారణంగా ఏడాది పొడవు నీరు లీకేజీ అయ్యేది. 2020 సంవత్సరంలో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం దెబ్బతిన్న గేట్లకు మరమ్మతులు చేయించి పూడికతీత పనులు చేపట్టింది. అనంతరం మాజీ మంత్రి హరీశ్‌రావు నారింజ ప్రాజెక్టును సందర్శించారు. ప్రాజెక్టును అభివృద్ధి చేయిస్తామని, పాత గేట్ల స్థానంలో కొత్తవి బిగిస్తామని చెప్పారు. కర్నాటకు నీరు వృథాగా వెళ్లకుండా పెద్ద సంఖ్యలో చెక్‌డ్యాంలు కట్టించి భూగర్భజలాలను పెంపుదలకు కృషి చేస్తామని రైతులకు హామీ ఇచ్చారు. ఇంతలోనే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. కాగా, ప్రాజెక్టును పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయించి నారింజ నీరు కర్నాటకు వృథాగా పోకుండా అరికట్టాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ఉపాధ్యాయుల సంక్షేమానికి కృషి

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: ఉపాధ్యాయుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని, నియోజకవర్గంలోని ప్రైవేట్ పాఠశాలల్లో విధులు నిర్వర్తిస్తున్న 3,000 మంది ఉపాధ్యాయులకు సొంత నిధులతో రూ. ఐదు లక్షల ఉచిత ప్రమాద బీమా అందించబోతున్నట్లు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. శనివారం జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన నియోజకవర్గస్థాయి ప్రైవేట్ పాఠశాలల గురుపూజోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి విద్యార్థిని భావిభారత పౌరులుగా తీర్చిదిద్దే గురుతర బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. విద్యతో పాటు క్రీడలపై ఆసక్తి పెంపొందించేలా ప్రతి పాఠశాల యాజమాన్యం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గంలోని ప్రైవేటు పాఠశాలల సంక్షేమానికి సంపూర్ణ సహకారం అందిస్తామని తెలిపారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల సంక్షేమ సంఘం రాష్ట్ర ముఖ్య సలహాదారు శేఖర్‌రావు, రాష్ట్ర కోశాధికారి రాఘవేంద్రరెడ్డి, నియోజకవర్గ అధ్యక్షుడు సాయితేజ, విద్యార్థులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

పటాన్‌చెరు టౌన్: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన గుమ్మడిదల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ మహేశ్వర్‌రెడ్డి కథనం ప్రకారం.. బొంతపల్లి శివారులోని ఓ ప్రైవేట్ కంపెనీ వెనకాల శనివారం గుర్తుతెలియని వ్యక్తి ఉరివేసుకొని మృతిచెంది కనిపించాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా.. వారు మృతదేహాన్ని పరిశీలించారు. మృతిచెందిన వ్యక్తి వయసు 35 నుంచి 45 సంవత్సరాలు ఉంటుందన్నారు. మృతుడికి సంబంధించిన బంధువులు ఉంటే పోలీసులను సంప్రదించాలని సూచించారు. ఈ మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సిద్ధేశ్వరుడికి విశేష పూజలు



బిల్వార్చన చేస్తున్న భక్తులు

ఝరాసంగం(జహీరాబాద్): పురాతన దేవాలయాల్లో ఒకటైన ఈదులపల్లి గ్రామ శివారులోని శ్రీరేవన సిద్ధేశ్వర ఆలయంలో శ్రావణమాసం ముగింపు శనివారం నిర్వహించారు. 41 రోజులు ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు. ముగింపు సందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటు అభిషేకం, కుంకుమార్చన, బిల్వార్చన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించారు. అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాతశ్రీ మఠం శివలీలమ్మ, రేవన సిద్దయ్య, బస్వరాజు పటేల్, రాంచందర్, నరసింహారెడ్డి, సంగమేశ్వర్, లక్ష్మయ్య, బక్క రెడ్డి, ప్రభుస్వామి, వివిధ గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

బీజేపీలోకి మల్‌శెట్టి



పార్టీలో చేరుతున్న మల్‌శెట్టి

జహీరాబాద్ టౌన్: బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు, మొగుడంపల్లి మండల ఉపాధ్యక్షుడు మామిడ్గి మల్‌శెట్టి మాజీ ఎంపీ బీబీ పాటిల్ సమక్షంలో బీజేపీలో చేరారు. శనివారం జహీరాబాద్‌కు వచ్చిన బీబీపాటిల్ హౌసింగ్‌బోర్డులోని మల్‌శెట్టి నివాసానికి వెళ్లి ఆయనతో మాట్లాడారు. అనంతరం కండువా కప్పి పార్టీలో చేర్చుకున్నారు. ఈ సందర్భంగా పాటిల్ మాట్లాడుతూ మల్‌శెట్టి చేరికతో మండలంలో పార్టీకి బలం చేకూరిందన్నారు. ఆయనకు అన్ని రకాల సహాయ సహకారాలను అందిస్తామన్నారు. జగన్నాథ్, శ్రీనివాస్‌గౌడ్, భాస్కర్, సుధీర్ బండారి, శ్రీనివాస్ గుప్తా, పూల సంతోశ్, రాంశెట్టి, విజేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

భవానీ మాత దీక్షదారుల పాదయాత్ర



కడ్పల్ శివారులో విశ్రాంతి పొందుతున్న భవానీ మాత దీక్షదారులు

కల్హేర్(నారాయణఖేడ్): నిజాంపేట మండలంలోని బల్కంచెల్క(భక్తిధాం) తండా నుంచి భవానీ మాత దీక్షదారులు శనివారం మహరాష్ట్రలోని తుల్జాపూర్ క్షేత్రానికి పాదయాత్ర చేపట్టారు. తండాలోని విశ్వపాళిని భవానీ సమేత సేవలాల్ మహారాజ్ మందిరం ధర్మకర్త, మేడ్చల్ జిల్లా రవాణా శాఖ అధికారి మూడ్ కిషన్‌సింగ్ ఆధ్వర్యంలో బల్కంచెల్క తండా, రాంచెందర్ తండా, నాగధర్, మునిగేపల్లి తండాలకు చెందిన దీక్షదారులు తుల్జాపూర్‌లో భవానీ మాత దర్శనం కోసం బయల్దేరారు. అంతకు ముందు తండాలోని మందిరంలో ప్రత్యేకంగా పూజలు చేశారు. నాగధర్, కడ్పల్, సిర్గాపూర్, వాసర్ మీదుగా మొదటి రోజు పాదయాత్ర చేశారు. కార్యక్రమంలో దీక్షదారులు శంకర్, రాములు, రూప్‌సింగ్, జైల్‌సింగ్, కిషన్, సవాయ్ సింగ్, మన్మోహన్ పాల్గొన్నారు.

ఖేడ్‌లో లక్ష బిల్వార్చన



లక్షబిల్వార్చనలో పాల్గొన్న మహిళలు

నారాయణఖేడ్: పట్టణంలోని ఏఎస్ నగర్ కాలనీలో భజరంగ్‌దళ్, లలితాదేవి వైభవం ట్రస్ట్ ఆధ్వర్యంలో గణేష్ మంటపంలో లక్షబిల్వార్చన చేశారు. శనివారం లక్ష పత్రివస్త్రసేవ, గణేష్ సంకటనాశన స్తోత్ర పారాయణం, మహాహారతి తదితర కార్యక్రమాలను సేవాధార్మిక శిఖర బ్రహ్మశ్రీ మోహన్ జ్యోషి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉత్సవకమిటీ బాధ్యులు, భక్తులు పాల్గొన్నారు.

భగవద్గీత పుస్తకాల పంపిణీ



భగవద్గీత పుస్తకాలు పంపిణీ చేస్తున్న మోహన్ జ్యోషి, శివాజీ శ్రీనివాస్

నారాయణఖేడ్: ఖేడ్ జంటగ్రామమైన మంగల్‌పేట్ హనుమాన్ ఆలయం ఆవరణలో శివశక్తి సంస్థ ఆధ్వర్యంలో భక్తులకు భగవద్గీత, హనుమాన్ చాలీసా పుస్తకాలను పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన అర్చకుడు మోహన్‌జ్యోషి వాటిని భక్తులకు అందజేశారు. ఈ సందర్భంగా శివశక్తి సంస్థ జిల్లా కార్యదర్శి శివాజీశ్రీనివాస్ మాట్లాడుతూ.. హిందువుల్లో భక్తిభావం పెంచేందుకు గ్రామగ్రామానా భగవద్గీత, హనుమాన్ చాలీసాలను పంపిణీ చేస్తున్నామన్నారు. వాటిని పఠించాలని కోరారు. పలువురు సంస్థ స్థానిక బాధ్యులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరి మరణం తీరని లోటు



మాట్లాడుతున్న సీపీఎం నేత వాజీద్ అలీ

పటాన్‌చెరు టౌన్: సీతారాం ఏచూరి మరణం వామపక్ష పార్టీలకే కాకుండా దేశానికి తీరని లోటు అని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు వాజీద్ అలీ, పాండురంగారెడ్డి అన్నారు. పట్టణంలోని శ్రామికభవన్‌లో శనివారం సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. 50 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ జీవితంలో వామపక్ష ప్రజాతంత్ర ఉద్యమాలకు దిశానిర్దేశం చేశారని కొనియాడారు. రాజ్యసభలో పేద బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి, కార్మిక, కర్షక, ప్రజా పోరాటాలకు మద్దతుగా తన గలాన్ని విప్పారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు అర్జున్, మల్లేష్, లకాన్, రమణారెడ్డి, తలారి శ్రీను, ఏడుకొండలు, రామకృష్ణ, ఆంజనేయులు, చక్రధర్‌సింగ్, మూర్తి పాల్గొన్నారు.

హిందీ భాషా దినోత్సవం

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని వశిష్ఠ డిగ్రీ కళాశాలలో శనివారం హిందీ భాష దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సిద్దారెడ్డి మాట్లాడారు. దేశ భాషలందూ హిందీ భాషకు అగ్రస్థానం ఉందన్నారు. ప్రతీఒక్కరు ఈ భాష నేర్చుకోవాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ మారుతిరావు మాట్లాడుతూ, దేశంలోని ఎక్కువ రాష్ట్రాల్లో హిందీ భాష మాట్లాడుతారన్నారు. అందుకని దానిపై పట్టుసాధించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు అమర్నాథ్, సంజీవరావు, చంద్రకాంత్, అధ్యాపకులు కృష్ణ, సంఘున్న, శశికాంత్, భార్గవి, లత, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ నూతన ఎస్‌ఐగా నారాయణ



రాయికోడ్(అందోల్): రాయికోడ్ ఎస్‌ఐగా నారాయణ శనివారం బాధ్యతలు స్వీకరించారు. డీటీసీలో పనిచేస్తున్న ఆయనను రాయికోడ్‌కు, అలాగే రాయికోడ్ ఎస్‌ఐగా విధులు నిర్వహించిన కిష్టయ్యను డీటీసీకి బదిలీచేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడతూ గణేష్ నిమజ్జన వేడుకలను నిబంధనలకు లోబడి ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని సూచించారు.

◆ ఉపాధి హామీ పనులపై తనిఖీ

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ మండలంలో ఉపాధి హామీ పథకం పనులపై శనివారం సామాజిక తనిఖీ నిర్వహించినట్లు ఏపీఓ బస్వరాజ్ తెలిపారు. బోక్కస్‌గాం, చీమల్‌పాడు, సర్పంచ్ తండా పంచాయతీలో జరిగిన ఉపాధి పనులు, నిధుల ఖర్చుపై డీఆర్‌పీలు తనిఖీ చేసినట్లు తెలిపారు.

◆ వినాయక మండపాల వద్ద అన్నదానం

జోగిపేట(అందోల్): పట్టణంలోని 17వ వార్డులోని తూర్పు గౌని ముదిరాజ్ సంఘ భవనంలో ప్రతిష్ఠించిన వినాయక మండపం వద్ద శనివారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ కౌన్సిలర్ చిట్టిబాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో స్థానిక మహిళలు, భక్తులు పాల్గొన్నారు. అలాగే బృందావన్ కాలనీ, 13వ వార్డులోను లయన్స్‌క్లబ్ సభ్యుడు కాసాల ప్రవీణ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

◆ డివిజన్ అభివృద్ధికి కృషి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): డివిజన్ అభివృద్ధి తనవంతుగా కృషి చేస్తానని కార్పొరేటర్ పుష్ప అన్నారు. శనివారం పట్టణంలోని హిందు శ్మశానవాటిలో సీసీరోడ్డు పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. శ్మశానవాటికను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని తెలిపారు. నీటి సదుపాయం, వాల్ పెయింటింగ్, కమాన్, శివుడి, కాటికాపరి విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని వివరించారు.

◆ వినాయక మండపాల సందర్శన

జహీరాబాద్: పట్టణంలో ప్రతిష్ఠించిన వినాయక ప్రతిమలను మాజీ ఎంపీ బీబీ పాటిల్ దర్శించుకున్నారు. శనివారం రాత్రి పట్టణంలోని ఐడీఎస్ఎంటీ కాలనీ, హౌసింగ్‌బోర్డు రాచన్నపేట్, శాంతినగర్ తదితర కాలనీల్లోని వినాయక మండపాలను సందర్శించి విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు బీబీ పాటిల్‌ను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు జి.భాస్కర్, అరుణ్‌కుమార్, కృష్ణారెడ్డి, జగన్, శ్రీనివాస్‌గౌడ్, పాల్గొన్నారు.

ఏకదంతాయ.. వక్రతుండాయ..



సంగారెడ్డి టౌన్ : వైకుంఠపురంలోని కోనేరులో నిమజ్జనం చేస్తున్న అర్చకులు



సదాశివపేట(సంగారెడ్డి) : గొల్లకేరీలోని గజానంద్ సేవాసదన్ మండపం వద్ద పూజలు



పటాన్‌చెరు టౌన్: కృష్ణ వర్ణం అలంకరణలో గణేష్‌గడ్డ గణనాథుడు

జిల్లా వ్యాప్తంగా గణపతి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ఆయా మండపాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం దగ్గర నిర్వాహకులు అన్నదానం చేశారు. కొన్ని మండపాల్లో గణపతి హోమం నిర్వహించారు.



రాయికోడ్(అందోల్): లడ్డూలతోపాటు భగవద్గీతను అందజేస్తున్న నిర్వాహకులు



జహీరాబాద్ :సాయిరాం కాలనీలో పూజలు చేస్తున్న భక్తులు



జహీరాబాద్: వసుంధరకాలనీలో వినాయకుడిని దర్శించుకుంటున్న భక్తులు



పటాన్‌చెరు టౌన్: ఇంద్రేశం గ్రామంలో గణనాథునికి 51 రకాల ప్రసాదాలు

శిక్షణ తరగతులు



ప్రశంసా పత్రాలు అందుకున్న విద్యార్థులు, అధ్యాపకులు

జహీరాబాద్ టౌన్: ఆచార్య డిగ్రీ కళాశాలలో తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్) టాస్క్ ఆధ్వర్యంలో వృత్తి నైపుణ్య శిక్షణ తగరగతులు నిర్వహించారు. 6 రోజుల నుంచి కొనసాగుతున్న శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. దీంతో ప్రశంసా పత్రాలను అందజేశారు. ట్రైనర్ రమేశ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు టాస్క్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులకు స్కిల్స్ ఎంతగానో అవసరం అని తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, టాస్క్ కోఆర్డినేటర్ నర్సింహులు, అధ్యాపకులు నికిత, దీపిక, శ్వేత, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

- ఎస్‌జీటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశం



జిల్లా అధ్యక్ష కార్యదర్శులను సన్మానిస్తున్న వెంకటేశం తదితరులు

జహీరాబాద్ టౌన్: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న విద్యాపరమైన సమస్యను పరిష్కరించాలని సెకండరీ గ్రేడ్ టీచర్స్ యూనియన్(ఎస్‌జీటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరికెల వెంకటేశం ప్రభుత్వాన్ని కోరారు. పట్టణంలో శనివారం నిర్వహించిన జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంలుగా ప్రమోషన్ కల్పించాలన్నారు. ప్రతీ పాఠశాలలో హెచ్‌ఎం పోస్టు ఉండేలా చూడాలన్నారు. ప్రతీ తరగతికొక టీచర్ ఉండాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏను వెంటనే చెల్లించాలన్నారు. పీఆర్‌సీలో ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్‌ల వేతన వ్యత్యాసం తగ్గించాలని కోరారు. ఉపాధ్యాయుల సమస్యలపై సంఘం రాజీలేని పోరాటాలు చేస్తోందని చెప్పారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు ఆకుల ప్రభాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కిష్టయ్య, నాయకులు మధుసూదన్‌రావు, పద్మారెడ్డి, మల్లికార్జున్, శ్రీనివాస్, మోహినుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అధ్యక్షుడిగా ప్రభాకర్

అనంతరం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎస్‌జీటీయూ జిల్లా అధ్యక్షుడిగా ఆకుల ప్రభాకర్, ప్రధాన కార్యదర్శిగా నిమ్మల కిష్టయ్యలను ఎన్నుకున్నారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశం వారిని సన్మానించారు.

మూడు ఇళ్లల్లో చోరీ

సంగారెడ్డి టౌన్ : మూడు ఇళ్లల్లో చోరీ జరిగి సంఘటన సంగారెడ్డి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని మంజీరా నగర్‌లో నివాసం ఉండే నవీన్ కుమార్, అమీర్, కృపాకర్ రెడ్డి ఇళ్లలో శుక్రవారం రాత్రి దొంగలు పడి రెండు లక్షల రూపాయల విలువచేసే బంగారం, నగదు దుండగులు ఎత్తుకెళ్లారు. దీంతో బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.